క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పరామర్శ



నాగమణి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీనివాసరావు

మామిడికుదురు: భార్య వియోగంతో బాధపడుతున్న లూటుకుర్రు శివారు బాడిలంకకు చెందిన అప్పన చినబాబును వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గం కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు బుధవారం పరామర్శించారు. చినబాబు భార్య అప్పన వెంకటలక్ష్మి నాగమణి చిత్రపటం వద్ద పుష్పాలు ఉంచి నివాళులర్పించారు. చినబాబు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, మట్టపర్తి శివ, నెల్లి దుర్గాప్రసాద్, వాసంశెట్టి వెంకట్రావు తదితరులు ఉన్నారు.

మరింత ఉన్నత స్థానానికి చేరుకోవాలి

మామిడికుదురు: జీఎస్టీపై కోనసీమ జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో జూనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతి సాధించిన మామిడికుదురు జెడ్పీహెచ్ ఎనిమిదో తరగతి విద్యార్థిని చింతలపూడి అలివేలు మంగతాయారును బుధవారం ఉపాధ్యాయులు అభినందించారు. స్కూల్ ప్రాంగణంలో జరిగిన సమావేశంలో హెచ్ఎం బొండాడ చిరంజీవి, ఉపాధ్యాయుల బృందం మంగతాయారును సత్కరించారు. ఆమెకు జ్ఞాపికను అందజేశారు. స్కూల్‌కు మంచి గుర్తింపు తీసుకు వచ్చిందంటూ ఆమెను అభినందించారు. మరింత ఉన్నత స్థానానికి చేరుకోవాలని అభిలాషించారు. ఆమెకు గైడ్‌గా వ్యవహరించిన టీచర్ ఎం.గంగాభవానిని కూడా అభినందించారు.

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి



పి.గన్నవరంలో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం: విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించి దేశ ప్రతిష్టను పెంపొందించాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ విద్యార్థులకు సూచించారు. పి.గన్నవరంలోని శింగంశెట్టి ప్రభావతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. హెచ్ఎం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. అండర్-14, అండర్-17 బాలురకు 7 రకాల పోటీలు నిర్వహించారు. మొత్తం 350 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలను డివిజన్ పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్ బొండాడ నాగమణి, నాయకులు సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ, ఎంఈఓలు కె.హెలీనా, చింతా వీరభద్రానందం, హెచ్ఎం టి.ఉమాదేవి, పీడీలు కేవీ రమణ, భీమేంద్ర, ఎం.దుర్గాప్రసాద్, ప్రభాకర్, సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

దాడికి యత్నించడం హేయం

మలికిపురం: ఇటీవల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడికి యత్నించడం హేయమైన చర్య అని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బూసి జాన్‌మోషే ఖండించారు. విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడుతూ మొన్న జరిగిన సంఘటనను మీడియా వక్రీకరించిందన్నారు. ఎందుకంటే ఒక న్యాయవాది లేదా న్యాయమూర్తి కులం, మతం ఉన్నప్పటికీ అవి కోర్టు ఆవరణలోకి వచ్చిన తర్వాత జ్యుడీషియల్ మైండ్ కలిగి ఉండాలన్నారు.

బాణసంచా సీజ్



కొత్తపేటలో బాణసంచా సామగ్రి సీజ్ చేసిన సీఐ విద్యాసాగర్, ఎస్సై సురేంద్ర

కొత్తపేట: స్థానిక ఆర్ఎస్ నగర్ ప్రాంతంలో అనధికారిక బాణసంచా సామగ్రి సీజ్ చేసినట్టు ఎస్సై జి.సురేంద్ర తెలిపారు. ఆ మేరకు బుధవారం రాత్రి ఆయన ఒక ప్రకటన విడుదల చేవారు. బాణసంచా తయారు చేయడంతో పాటు, నిల్వలు ఉన్నాయని అందిన సమాచారం మేరకు రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఎస్సై సురేంద్ర, సిబ్బంది దాడులు నిర్వహించారు. ఒక వ్యక్తి ఇంటి పక్కన బాణసంచా తయారీకి సంబంధించి సుమారు రూ.1.04 లక్షలు విలువైన సామగ్రిని గుర్తించి సీజ్ చేసినట్టు పేర్కొన్నారు. అలాగే కొత్తపేటలో బాణసంచా తయారీ కేంద్రాలు, దీపావళి బాణసంచా హోల్‌సేల్ షాపులను తనిఖీ చేసి నిబంధనలు విధిగా పాటించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కనులపండువగా బేతాళస్వామి ఉత్సవం

- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- కట్టుదిట్టంగా పోలీసుల భద్రత



ఉత్సవానికి కొలువుదీరిన శ్రీకృష్ణుడి వాహనం



బేతాళస్వామి ఉత్సవానికి తరలివెళ్తున్న వినాయకుడు



ఉత్సవానికి కొలువుదీరిన కనకదుర్గ వాహనం



ఉత్సవానికి కొలువుదీరిన ఆంజనేయస్వామి వాహనం

అంబాజీపేట: విజయ బేతాళస్వామి ఉత్సవాలు కనులవైకుంఠంగా సాగాయి. అంబాజీపేటలో 13 పాలాలకు చెందిన వివిధ రకాల గ్రామమూర్తులు పురవీధుల్లో ఊరేగుతూ స్థానిక సెంటర్‌లో కొలువుదీరి భక్తులను కనువిందు చేశాయి. అంబాజీపేట, మాచవరం శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే బేతాళస్వామి సంబరాలు బుధవారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకూ అట్టహాసంగా, కనులపండువగా సాగాయి. శ్రీనివాస నగర్‌లో వేంచేసిన విజయబేతాళ స్వామి ఆలయం వద్ద నుంచి ఈ సంబరాలు ప్రారంభమయ్యాయి. 13 పాలాల నిర్వాహకులు దేవతామూర్తులను వాహనాలపై పెట్టి రంగురంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మేళతాళాలు, బాజా భజంత్రీలతో పురవీధుల్లో ఊరేగించారు. వాహనాల ముందు చెడీ తాలింఖానా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యువకులు చేసిన విన్యాసాలు గగుర్పాటుకు గురి చేశాయి. గరగ నృత్యాలు, కోబ్రా, శక్తి వేషాలు పలువురిని ఆకట్టుకున్నాయి. స్థానిక సెంటర్‌లో పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. తెల్లవార్లు జరిగే ఈ ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరకుండా అమలాపురం డీఎస్పీ వై.మాధవరావు ఆధ్వర్యంలో పి.గన్నవరం సీఐ ఆర్.భీమరాజు పర్యవేక్షణలో ఎస్సై కె.చిరంజీవి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అంబాజీపేట బేతాళస్వామి వారిని వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి ముమ్మిడివరం మండపేట పరిశీలకులు చెల్లుబోయిన శ్రీను దర్శించుకున్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



ర్యాలిలో పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న శ్రీధర్

కొత్తపేట: మండలంలోని ర్యాలి గ్రామంలో జిల్లా వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి కప్పల శ్రీధర్ అభిమానులు, కుటుంబ సభ్యులు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం శ్రీధర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని రాజమహేంద్రవరం బుద్ధుడు కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 100 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. అలాగే శ్రీధర్ చేతుల మీదుగా సుమారు 150 మంది పేద మహిళలకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శ్రీధర్‌ను సత్కరించి, ఆయనతో కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బోనం సాయిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు కనుమూరి శ్రీనివాసరాజు, ఆ పార్టీ రాష్ట్ర క్రిస్టియన్, మైనార్టీ విభాగం జాయింట్ సెక్రటరీ పీఎస్ఆర్ జయపాల్ రెడ్డి, వాడపల్లి దేవస్థానం మాజీ సభ్యుడు మెర్ల వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు పువ్వుల వరప్రసాద్, యడ్ల రాముడు పాల్గొన్నారు.

మండలాన్ని తూర్పులో విలీనం చేయాలి



ఆలమూరులో మండలాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయాలని కోరుతూ ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాలు

ఆలమూరు: జిల్లాల పునర్విభజనలో భాగంగా ఆలమూరు మండలాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయాలని కోరుతూ మండల ప్రజాసంఘాలు ముక్తకంఠంతో డిమాండు చేశాయి. స్థానిక శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మండపం ఆవరణలో సీపీఐ మండల కార్యవర్గ సభ్యుడు వి.శామ్యూల్ అధ్యక్షతన ప్రజాసంఘాల సమావేశం బుధవారం జరిగింది. విద్య, వైద్య, రవాణా, వ్యాపార పరంగా అన్ని రంగాల్లో మండలవాసులకు రాజమహేంద్రవరంతో ఎనలేని అనుబంధం ఉందని పలువురు వక్తలు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మండలానికి జిల్లా కేంద్రమైన అమలాపురం దూరంగా ఉండటంతో పాటు ఇంకా సరైన రవాణా సౌకర్యాలు లేవన్నారు. దీని వల్ల ప్రజల ఆకాంక్షల మేరకు ఆలమూరు మండలాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేసే దిశగా అందరూ సమష్టి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం కాని ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకోకపోతే ఉద్యమ కార్యాచరణకు తగిన ప్రణాళిక రూపొందిస్తామని హెచ్చరించారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజానీకం ఆకాంక్షలను తెలియజేసే విధంగా మండలాన్ని తూర్పుగోదావరిలో కలపాలని తీర్మానాలు పంపిద్దామని ప్రజా ప్రతినిధులు తీర్మానించారు. రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, పెన్షనర్లు అందరూ ఉద్యమానికి మద్దతు ఇవ్వడం వల్ల ఇప్పటికే సగం విజయం సాధించామని తెలియజేశారు. అనంతరం మండలాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం ఆవశ్యకతను వివరిస్తూ ప్రజా సంఘాల నేతలు భారీ ర్యాలీ నిర్వహించారు. సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నేత జె.సత్తిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం నేత కె.రామకృష్ణ, బీఎస్పీ నేత కొత్తియ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రవికుమార్, ప్రజా సంఘాల ప్రతినిధులు కొపనాతి శ్రీనివాసరావు, మధుసూదనరెడ్డి, జె.యేసురాజు, దడాల చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్ పోస్టర్ల ఆవిష్కరణ



మామిడికుదురులో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

మామిడికుదురు: చెకుముకి టాలెంట్ టెస్ట్ పోస్టర్ల ఆవిష్కరణ మామిడికుదురు ఎమ్మార్సీ వద్ద బుధవారం జరిగింది. ఎంఈఓలు సీహెచ్ లక్ష్మీనారాయణ, మోకా వెంకన్నబాబు ఈ పోస్టర్లను ఆవిష్కరించారు. విద్యార్థులు చెకుముకి సైన్స్ సంబరాల్లో పాల్గొని ప్రతిభ చాటాలని ఎంఈఓలు సూచించారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ఈ నెల 18న గ్రామ స్థాయిలోను, నవంబర్ 1న మండల స్థాయిలో, నవంబర్ 23న జిల్లా స్థాయిలో చెకుముకి సైన్స్ సంబరాలు జరుగుతాయని జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు, యూటీఎఫ్ కోశాధికారి సీహెచ్ కేశవరావు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలం పెద్దిరాజు, జి.నాగేంద్రప్రసాద్, ఎం.సత్యనారాయణ, రామ్‌కుమార్, బేగం, సీహెచ్ రమేష్‌బాబు పాల్గొన్నారు.



మలికిపురంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎంఈఓ విజయశ్రీ

మలికిపురంలో..

మలికిపురం: జన విజ్ఞాన వేదిక (జేవీవీ) ఆధ్వర్యంలో జరిగే చెకుముకి సైన్స్ సంబరాలు వాల్‌పోస్టర్‌ను బుధవారం మలికిపురంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎం.విజయశ్రీ పాల్గొని పోస్టర్ విష్కరించారు. వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీవీ వర ప్రసాద్ మాట్లాడుతూ 35 ఏళ్లుగా జేవీవీ విద్యార్థుల్లో చదువులో పోటీతత్వాన్ని, సైంటిఫిక్ ఆలోచనను కలిగించి, సైంటిఫిక్ జీవన విధానం అలవర్చుకునేందుకు కృషి చేస్తుందన్నారు. అందులో భాగంగా విద్యార్థి చెకుముకి సైన్స్ మాసపత్రిక నడుపుతుందని అన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఈ పత్రిక ఆవిష్కరణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో శేఖర్, జిల్లా కల్చరల్ కన్వీనర్ సీహెచ్ తులసీరావు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు, రోగుల సమస్యలు తీర్చండి



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు

అంబాజీపేట: అంబాజీపేట, ముక్కామల పీహెచ్‌సీల్లో ప్రసవాలు జరిగేందుకు అవకాశాలు లేకపోవడంతో పి.గన్నవరం సీహెచ్‌సీకి వెళుతున్నారని అక్కడ మత్తువైద్యురాలు అందుబాటులో లేకపోవడంతో గర్భిణులు నానా ఇబ్బందులు పడుతున్నారని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ దృష్టికి ప్రజాప్రతినిధులు తీసుకువచ్చారు. అంబాజీపేట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. పుల్లేటికుర్రు సర్పంచ్ జల్లి బాలరాజు మాట్లాడుతూ వైద్య సిబ్బంది సుఖ ప్రసవాలకు ప్రభుత్వ ఆసుపత్రులకు రాలవాలని ప్రచారం చేస్తున్నారని అయితే ఆపరేషన్లు నిర్వహించే విషయంలో మత్తు వైద్యురాలు అందుబాటులో లేకపోవడంతో రోజుల తరబడి గర్భిణులు, రోగులు ఆపరేషన్ల కోసం వేచి చూస్తున్నారని ఎమ్మెల్యే సత్యనారాయణ దష్టికి తీసుకువచ్చారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే ఈ సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే వివరించారు. అలాగే పుల్లేటికుర్రులో గతంలో నిర్మించిన పైపులైన్లు పనులు సరిగ్గా చేయకుండానే జల్‌జీవన్ మిషన్ పనులు చేపట్టారని దాంతో గత పైపులైన్లు నిధులు గాలిలో కలసిపోయాయని ఎంపీటీసీ పబ్బినీడి రాంబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జయశ్రీని ప్రశ్నించారు. గ్రామాల్లో ఆర్వో ప్లాంట్ల ద్వారా అందిస్తున్న తాగునీరు శుద్ధి కావడం లేదని, ఆర్వో ప్లాంట్లు ద్వారా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో 20 లీటర్ల టిన్నును రూ.15 పైబడి విక్రయిస్తున్నారని ఇసుకపూడి ఎంపీటీసీ ముత్తాబత్తుల ప్రశాంత్‌కుమార్ అధికారులను ప్రశ్నించారు. ఆర్వో ప్లాంట్లపై అధికారులు తనిఖీలు నిర్వహించాలని ఆయన కోరారు. అనంతరం వివిధ శాఖల అధికారులు ఆయా పథకాలను వివరించారు. అనంతరం ఎమ్మెల్యే గిడ్డిని ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. సమావేశంలో జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, నీటిపారుదలశాఖ డైరక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, ఎంపీటీసీలు, సర్పంచులు, సొసైటీ చైర్మన్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్వదేశీ వస్తువులనే కొనుగోలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దిరెడ్డి

పి.గన్నవరం: స్వదేశీ వస్తువులనే కొనుగోలు చేసేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దిరెడ్డి రవికిరణ్ సూచించారు. ఆత్మ నిర్భర్ భారత్ కార్యక్రమంలో భాగంగా మండల బీజేపీ అధ్యక్షుడు తిక్కా సత్తిబాబు ఆధ్వర్యంలో స్థానిక బీవీఆర్ కాంప్లెక్స్‌లో బుధవారం జిల్లా కార్యశాల సమావేశం జరిగింది. జిల్లా పార్టీ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పెద్దిరెడ్డి ముఖ్య అతిథిగా మాట్లాడారు. స్వదేశీ మంత్రంతో భారత ఆర్థిక వ్యవస్థను పటిష్ఠం చేయాలన్నారు. ప్రతి ఇంటికీ ఈ నినాదాన్ని తీసుకువెళ్లాలని అన్నారు. దీని కోసం మండలానికి ఒక కన్వీనర్, ఇద్దరు కో కన్వీనర్లను నియమిస్తున్నట్టు వివరించారు. బీజేపీ జాతీయ కార్యవర్గ మండలి సభ్యుడు మానేపల్లి అయ్యాజీ వేమా మాట్లాడుతూ స్వదేశీ వస్తువులను ప్రోత్సహిస్తూ భారత్‌ను అగ్రగామిగా నిలపాలన్నారు. జాతీయ అధికారిక భాష హిందీ సలహా కమిటీ సభ్యుడిగా నియమితులైన ఎస్.సాధిక్‌ను ఘనంగా సత్కరించారు. రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి చీకరమెల్లి శ్రీనివాసరావు, మాలే శ్రీనివాస నగేష్, గొల్లకోటి వెంకటరెడ్డి, తమలంపూడి రామకృష్ణా రెడ్డి, విళ్ల సత్యనారాయణ, సలాది వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు అంబాజీపేట విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన అంబాజీపేట విద్యార్థులు

అంబాజీపేట: గ్రామ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్) ఉమ్మడి తూర్పుగోదావరి స్థాయిలో నిర్వహించిన వివిధ క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. అండర్-19 నెట్‌బాల్ విభాగంలో కేఎల్‌డీఎస్ పూర్ణిమ (జూనియర్ ఇంటర్), అండర్-14 నెట్‌బాల్ విభాగంలో పి.జాహ్నవి, వై.జనార్దన్, అండర్-19 బాస్కెట్‌బాల్ విభాగంలో ఎం.మౌనిక, తైక్వాండో అండర్-14 విభాగంలో కె.కావ్య, అండర్-17 విభాగంలో పి.చరణ్యశ్రీ ఎంపికయ్యారని పీడీ కుంపట్ల ఆదిలక్ష్మి, పీఈటీ ఆకుల ఉమామహేశ్వరరావు, తైక్వాండో కోచ్ పి.త్రిమూర్తులు తెలిపారు. ఎంపికైన వారిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కడలి సాయిరాం, కాలేజ్ ఇన్‌చార్జ్ ఫణి, పీఈటీ సూర్యకుమారి, ఉపాధ్యాయులు అభినందించారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం



దాత బోరయ్యకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ప్రధానార్చకుడు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి కాజులూరు మండలం జగన్నాథగిరికి చెందిన గుత్తుల బోరయ్య, విజయలక్ష్మి దంపతులు బుధవారం రూ.10,116 విరాళం సమర్పించారు. ఈ సొమ్మును ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావుకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

జాతీయ రహదారిని ముంచెత్తిన భారీ వర్షం



మామిడికుదురులో జాతీయ రహదారిపై నిలిచిన వర్షపునీరు

మామిడికుదురు: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం భారీ వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లో రోడ్లపై భారీగా వర్షం నీరు నిలిచింది. ఉదయం ఎండ కాసింది. తర్వాత క్రమేపీ కారుమబ్బులు కమ్ముకుని భారీ వర్షం కురిసింది. ఈ భారీ వర్షంతో మామిడికుదురులోని 216వ నంబర్ జాతీయ రహదారిపై నీరు నిలిచింది. పాత పోలీస్ స్టేషన్ వద్ద నుంచి బోయి భీమన్న స్మారక భవనం వరకు జాతీయ రహదారిపై ముంపు నీరు నిలవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షం నీరు ఎటూ వెళ్లే పరిస్థితి లేక పోవడంతో అది రోడ్డుపై నిలిచిపోతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. భారీ వర్షం కురిసిన ప్రతిసారీ ఇదే సమస్య ఏర్పడుతోందన్నారు. ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించే దిశగా డ్రైనేజీ సదుపాయం కల్పించాలని స్థానికులు డిమాండ్ చేశారు.

రైతులను కలచి వేస్తున్న గోదావరి కోత



అప్పనపల్లిలో నదిలో పడిపోయిన కొబ్బరిచెట్టు

మామిడికుదురు: గోదావరి నదీకోత రైతులను తీవ్ర ఆవేదనకు గురి చేస్తోంది. ఎంతో సారవంతమైన భూములతో పాటు కొబ్బరి చెట్లు కోత బారిన పడడంతో తీరంలోని రైతులు నష్టపోతున్నారు. ఇటీవల వచ్చిన గోదావరి వరదలకు కోత మరింత పెరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వైనతేయ కుడి వైపున పెదపట్నం గ్రామం నుంచి ఆదుర్రు వరకు నదీపాతం తీవ్రంగా ఉందని చెబుతున్నారు. నెల నెలా ఆదాయాన్ని ఇచ్చే కొబ్బరి చెట్లు సారవంతమైన భూములు నదీగర్భంలో కలసిపోతున్నాయని రైతులు తీవ్రంగా మదన పడుతున్నారు. కోత నివారణకు గతంలో వేసిన గ్రోయిన్లు, రివిట్‌మెంట్ సైతం కోత బారిన పడుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. కోత నివారణకు ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఆ దిశగా ప్రజా ప్రతినిధులు, అధికారులు కార్యాచరణ చేపట్టాని కోరుతున్నారు.

శాస్త్రీయ పద్ధతిలో పశుపోషణ మేలు

కపిలేశ్వరపురం (మండపేట): శాస్త్రీయ పద్ధతిలో పశు పోషణ చేపట్టడం ద్వారా మేలైన ఫలితాలను దక్కించుకోవచ్చని కేంద్రీయ పశు నమోదు అధికారి డి.రాజేశ్వరరావు అన్నారు. మండపేట మండలం తాపేశ్వరంలో కేంద్రీయ పశు నమోదు పథకం, మత్స్య, పశు సంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్వచ్ఛత అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతు అవగాహన కార్యక్రమంలో భాగంగా కేంద్రీయ పశు నమోదు అధికారి డి.రాజేశ్వరరావు పాడి రైతులకు పలు అంశాలను వివరించారు.

బాణసంచా ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి

మలికిపురం: జిల్లాలోని మండపేట నియోజకవర్గం రాయవరం మండలం కొమరిపాలెంలో బాణసంచా తయారీ కేంద్రంలో అగ్నిప్రమాదం జరగడం బాధాకరమని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందారన్న విషయం తెలియగానే తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని అన్నారు. తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి మెరుగైన చికిత్స అందించాలని, తక్షణమే ప్రభుత్వం వారిని అన్ని విధాలా ఆదుకోవాలని గొల్లపల్లి డిమాండ్ చేశారు.

రేపు అంగరలో వ్యాసరచన పోటీలు

కపిలేశ్వరపురం: అంగర గ్రామానికి చెందిన తోరాటి లక్ష్మణ మూర్తి జయంతిని పురస్కరించుకుని శుక్రవారం అంగర జెడ్పీ ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్టు తోరాటి లక్ష్మణమూర్తి విజ్ఞాన కేంద్రం నిర్వాహక నాయకుడు పెద్దింశెట్టి లక్ష్మణమూర్తి బుధవారం తెలిపారు. తెలంగాణ సాయుధ భూ పోరాటంలో లక్ష్మణమూర్తి పాల్గొని వీరమరణం పొందారని, ఈనెల 13న ఆయన జయంతి సందర్భంగా 'సామాజిక సమస్యలు – విద్యార్థుల పాత్ర' అంశంపై వ్యాసరచన, సంస్మరణ కార్యక్రమాలను నిర్వహించనున్నామని లక్ష్మణ మూర్తి తెలిపారు.